

బాధితురాలు లక్ష్మికి రూ.2.50లక్షల ఎల్‌వోసీని అందజేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

ఆపదలో ఉన్న ప్రతి కుటుంబాన్ని ఆదుకునేందుకు కృషి

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాబాద్, జూలై 16 : ఆపదలో ఉన్న ప్రతి పేద కుటుంబాన్ని ఆదుకునేందుకు తమ వంతు కృషి చేస్తామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. షాబాద్ మండలంలోని ముద్దెంగూడ గ్రామానికి చెందిన లక్ష్మి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ దవాఖానలో చికిత్స చేయించుకుంటున్న సందర్భంగా మంగళవారం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.2.50 లక్షల ఎల్‌వోసీని ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ రకాల అనారోగ్య కారణాలతో దవాఖానల్లో చికిత్స చేయించుకునే పేద ప్రజలకు సీఎం సహాయనిధి ద్వారా సహాయం అందించి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, చేవెళ్ల మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ చెన్నయ్య, మాజీ సర్పంచులు రవీందర్‌నాయక్, మహేందర్‌గౌడ్, నాయకులు పెంటయ్య, శేఖర్, అహ్మద్ జానీ, శ్రీనివాస్, రవి, కుమార్ ఉన్నారు.



ముడిమ్యాల్ గ్రామంలో బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

ఘనంగా ఎల్లమ్మ బోనాలు

చేవెళ్ల రూరల్, జూలై 16 : చేవెళ్ల మండల పరిధిలోని ముడిమ్యాల్ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, గౌడ సంఘం నాయకులు రవిగౌడ్, శ్రీను, మాధవరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రాములు, వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

బురదమయంగా రోడ్డు

పెద్దఅంబర్‌పేట, జూలై 16 : మున్సిపాలిటీ పరిధి పసుమాములలోని సాధన కాలనీలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. సమస్యలు తీర్చాలని కాలనీ ప్రతినిధులు మంగళవారం మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కాలనీ రోడ్డు బురదమయంగా మారిందని, డ్రైనేజీ లేక మురుగు రోడ్లపైనే పారుతున్నదని, తీవ్రమైన దుర్వాసన వస్తున్నదని, నిత్యం విద్యార్థులు బడులకు వెళ్లే సమయంలో మురుగుతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. వానొస్తే చాలు బురదతో ఇక్కట్లు ఎక్కువవుతున్నాయని, సీసీ రోడ్డు మంజూరు చేయించాలని కోరారు. కాలనీలో కుక్కల బెడదను సైతం తీర్చాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సాధన వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజు, వైస్ ప్రెసిడెంట్ వెంకటరమణ, కాలనీ ప్రతినిధులు రాథోడ్, సోమయ్య, నర్సింహ, సత్యనారాయణ, వెంకటేశ్ పాల్గొన్నారు.

నక్కలపల్లి రోడ్డుకు నిర్మిస్తున్న కల్వర్టు పక్క నుంచి మొరం పోసి వేసిన రోడ్డు

కల్వర్టు పక్క నుంచి మొరం పోసి రోడ్డు ఏర్పాటు

నమస్తే తెలంగాణ కథనానికి స్పందన

నమస్తే ఎఫెక్ట్

మొయినాబాద్, జూలై 16 : నక్కలపల్లి-వెంకటాపూర్ గ్రామాల మధ్య ఉన్న రోడ్డుపై 'కల్వర్టు నిర్మాణం.. నిలిచిపోయిన రాకపోకలు' అనే కథనానికి అధికారులు స్పందించారు. కల్వర్టు నిర్మాణంతో ప్రజా రవాణా నిలిచిపోయిందని నమస్తే తలంగాణ దిన పత్రికలో వచ్చిన కథనానికి పంచాయతీరాజ్ అధికారులు స్పందించారు. కల్వర్టు నిర్మాణం పక్క నుంచి అధికారులు మొరం పోసి వాహనాల రాకపోకలు సాగేలా మొరం పోశారు. కల్వర్టు నిర్మాణం పూర్తి కావడానికి సుమారు 20 రోజుల సమయం పట్టనుండటంతో వచ్చిపోయే వాహనాలు చుట్టూ తిరిగి వెళ్లకుండా వాహనాలు కల్వర్టు నిర్మాణం పక్క నుంచి వేసిన అనుబంధ రోడ్డు గుండా వెళ్లడానికి ఏర్పాటు చేశారు. విద్యార్థులు వెళ్లే పాఠశాల బస్‌లు కూడా అనుబంధ రోడ్డు నుంచి వెళ్లడానికి అవకాశం ఉంటుంది. వర్షం పడినా వాహనాలు దిగిపోకుండా పక్క నుంచి రోడ్డు చేసి మొరం పోశారు. కల్వర్టు నిర్మాణానికి కూడా తక్కువ బడ్జెట్ వచ్చిందని, అయినా పక్క నుంచి రోడ్డు వేయడానికి పక్క పొలం రైతు అనుమతి ఇవ్వలేదని, తమ పొలం నుంచి అనుబంధ రోడ్డు వేయరాదని చెప్పడంతో అనుబంధ రోడ్డు వేయలేదని పంచాయతీరాజ్ అధికారులు పేర్కొన్నారు. కల్వర్టు నిర్మాణం చాలా సంతోషమని, పక్క నుంచి వాహనాల రాకపోకల కోసం రోడ్డు చేయడం చాలా సంతోషకరమని నక్కలపల్లి గ్రామస్తులు అంటున్నారు.

అనుమానాస్పదస్థితిలో గుర్తు తెలియని మహిళ మృతి

షాద్‌నగర్, జూలై 16 : అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతిచెందిన ఘటన కేశంపేట మండలం వేములనర్వ గ్రామపంచాయతీ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వేములనర్వ గ్రామ పరిధిలోని వేణుగోపాలస్వామి ఆలయం సమీపంలో గల చెట్ల పొదల్లో సుమారు 30 ఏండ్లు కలిగిన ఓ గుర్తు తెలియని మహిళ అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన విషయాన్ని గుర్తించామని పేర్కొన్నారు. మృతికి గల కారణాలు తెలియరాలేదని, మహిళ మృతిపై కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో విచారణ చేస్తామని తెలిపారు. రెండు, మూడు రోజుల క్రితం మహిళా మృతి చెంది ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. మృతురాలి ఒంటిపై ఆకుపచ్చ, ఎర్రటి రంగు కలిసిన చీర ఉందని వివరించారు. సంఘటనా స్థలాన్ని షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, కేశంపేట ఎస్ఐ రాజ్‌కుమార్ పరిశీలించి వివరాలను సేకరించారు.

సమస్యలు పరిష్కరించాలి

జిల్లాలో కొనసాగుతున్న మధ్యాహ్న భోజన కార్మికుల రిలే నిరాహార దీక్షలు

కడ్తాల్ : సీఐటీయూ ఏరియా కన్వీనర్ పెంటయ్య ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట కళ్లకు గంతలు కట్టుకొని నిరసన

కడ్తాల్, జూలై 16 : మధ్యాహ్న భోజన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ ఏరియా కన్వీనర్ పెంటయ్య అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన కార్మికులు మండల కేంద్రంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. మంగళవారం మండల కేంద్రంలోని బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు కళ్లకు గంతలు కట్టుకొని వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పెంటయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడుస్తున్నా మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కారం కావడంలేదని తెలిపారు. గత నాలుగు నెలలుగా గౌరవ వేతనం, భోజన బిల్లులురాక కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులకందించే కోడిగుడ్లకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, మధ్యాహ్న భోజన కార్మికులకు గౌరవ వేతనాన్ని రూ.10 వేలకు పెంచాలన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మమ్మ, సభ్యులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

యాచారం : మధ్యాహ్న భోజన కార్మికులందరికీ చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బ్రహ్మయ్య, మండల కన్వీనర్ చందూనాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల్లో చదువుతున్న పిల్లల కడుపు నింపడానికి అప్పులు చేసి మరీ మధ్యాహ్న భోజనం వండిపెట్టినట్లు తెలిపారు. సకాలంలో బిల్లులు చెల్లించకపోతే భోజనం ఎలా వండిపెట్టాలని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి సర్కారుకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే మెస్ చార్జీలు, కోడిగుడ్డు బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఆమనగల్లు : ఎంపీడీవో కార్యాలయం ఎదుట కండ్లకు గంతలు కట్టుకొని సమ్మె

సమ్మెకు సంఘీభావం

ఆమనగల్లు : పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు మండల పరిషత్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరాహార దీక్షలు రెండో రోజుకు చేరుకున్నాయి. మంగళవారం కండ్లకు గంతలు కట్టుకొని సమ్మె చేశారు. సీఐటీయూ ఏరియా కన్వీనర్ పెంటయ్య సమ్మెకు సంఘీభావం తెలిపారు.

యాచారం : రిలే నిరాహార దీక్ష చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్రకు అప్పగించవద్దు

షాద్‌నగర్‌టౌన్ : మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్రకు అప్పగించవద్దని సీఐటీయూ నాయకులు మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ అనంద్‌సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఏజెన్సీల ద్వారానే అందుతుందన్నారు. ఏజెన్సీలకు ప్రతి నెలా సకాలంలో వేతనాలను చెల్లిస్తూ వారికే మధ్యాహ్న భోజన పథకాన్ని అందించేలా చూడాలన్నారు. లేకుంటే ఆందోళన చేపడుతామని ఆయన హెచ్చరించారు.

షాద్‌నగర్‌టౌన్ : డిప్యూటీ తహసీల్దార్ ఆనంద్‌సింగ్‌కు వినతిపత్రమిస్తున్న సీఐటీయూ శ్రేణులు

శంకర్‌పల్లి మండల పరిధిలోని కొండకల్ గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు పెంటయ్య ఇటీవల మృతిచెందాడు. మంగళవారం మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి పెంటయ్య కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. - చేవెళ్ల రూరల్, జూలై 16

రోడ్డు పనులను పరిశీలిస్తున్న మాజీ సర్పంచ్ రాంచంద్రయ్యగౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ నరేందర్

సొంత నిధులతో..

- రూ.4లక్షలతో మట్టి రోడ్డు, కల్వర్టుల నిర్మాణం
- రావులపల్లి టూ నక్కలపల్లి వరకు తొలగిన ఇబ్బందులు

చేవెళ్ల రూరల్, జూలై 16 : చేవెళ్ల మండల పరిధిలోని రావులపల్లి టు నక్కలపల్లి వరకు రోడ్డు అధ్వానంగా తయారవ్వడంతో రైతులు, అటుగా ప్రయాణించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో స్పందించిన రావులపల్లి మాజీ సర్పంచ్ రాంచంద్రయ్యగౌడ్ సొంత నిధులు రూ.4 లక్షలు వెచ్చించి రైతులు, ప్రజల సౌకర్యార్థం ప్రయాణం సాఫీగా సాగేలా మట్టి రోడ్డు, కల్వర్టుల నిర్మాణం చేపట్టి ప్రజల ఇబ్బందులను తొలగిస్తున్నారు. దీంతో గ్రామస్తులు, రైతులు రాంచంద్రగౌడ్‌ను అభినందిస్తున్నారు.

పొలాల వద్దకు వెళ్లలేని దుస్థితి

గతంలో మా వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లలేని దుస్థితి నెలకొనేది. మట్టి రోడ్డు సరిగ్గా లేకపోవడంతో వర్షం పడితే చాలు నడవలేని పరిస్థితి ఉండేది. మాజీ సర్పంచ్ చొరవతో మట్టి రోడ్డుకు తన సొంత నిధులు కేటాయించడం గొప్ప విషయం. గ్రామాభివృద్ధిపై ఆయనకున్న చిత్తశుద్ధి చాలా గొప్పది. ఆయనకు మా రైతుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు.

- తంగడిపల్లి జంగయ్య, రైతు, రావులపల్లి, చేవెళ్ల మండలం

ఇబ్బందులు పడేవాళ్లం

గతంలో ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడేవాళ్లం. వర్షం పడితే బురదమయంగా రోడ్డు తయారయ్యేది. పొలాలకు వెళ్లాలంటే అస్సలు కుదిరేది కాదు. రోడ్డును పునరుద్ధరించేందుకు మాజీ సర్పంచ్ తీసుకున్న చొరవ హర్షణీయం. ఆయనకు గ్రామ ప్రజల తరపున రుణపడి ఉంటాం.

- పల్లె ముత్యాల్‌గౌడ్, రైతు, రావులపల్లి, చేవెళ్ల మండలం

మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి

కొత్తూరు సీఐ నరసింహారావు

మాంటిస్సోరీ హైస్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ నరసింహారావు

కొత్తూరు, జూలై 16 : విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కొత్తూరు సీఐ నరసింహారావు అన్నారు. కొత్తూరు మండలంలోని మాంటిస్సోరీ హైస్కూల్ విద్యార్థులకు నూతన చట్టాలు, మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా, సైబర్ నేరాలపై సీఐ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు మాదక ద్రవ్యాల వినియోగంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే విద్యార్థులు మొదలుకొని ప్రతిఒక్కరూ సెల్‌ఫోన్లు వాడుతున్నారని.. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. దీంతోపాటు కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాలను తెచ్చిందని.. వాటి గురించి తెలుసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుదర్శన్‌గౌడ్, ఎస్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పట్టపగలే పుస్తెలతాడు చోరీకి యత్నం

- ప్రతిఘటించిన బాధిత మహిళ
- దొంగలను పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు

యాచారం, జూలై 16 : పట్టపగలే మహిళ మెడలో నుంచి మూడున్నర తులాల పుస్తెలతాడును అపహరించేందుకు గుర్తు తెలియని దుండగులు యత్నించారు. ఈ ఘటనలో మహిళ తిరగబడి ప్రతిఘటించడంతో అప్రమత్తమైన గ్రామస్తులు దొంగలను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. దీనికి సంబందించి బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి అనుబంధంగా ఉన్న మొగుళ్లవంపు గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ చిప్పలపల్లి ప్రతాప్‌రెడ్డి భార్య రజిత తన ఇంటి నుంచి పొలానికి బయలుదేరింది. అప్పటికే గత కొద్దిసేపటి నుంచి రజిత ఇంటి వద్ద దొంగలు మాటేశారు. ఆమె పొలానికి వెళ్లడం చూసిన దుండగులు వెనుక నుంచి ఆమెను అనుసరించారు. పొలానికి నడుచుకుంటూ వెళ్తున్న రజిత ఎదుట ఒక ప్లాన్ ప్రకారం పార కోసం వాడే కావ(కర్ర)ను ఉంచారు. ఇది నీదేనా అంటూ దుండగులు ఆమెను అడిగారు. అది తనది కాదని ఆమె బదులిచ్చింది. అయినప్పటికీ నీదేనేమో ఒకసారి చూడు అని పదే పదే అనడంతో ఆమె ఆ కర్రను తీయడానికి కిందకు వంగింది. అదే అదనుగా భావించిన దుండగుల్లో ఒకడు తలను పట్టుకోగా.. మరొకడు పుస్తెలతాడును లాగడానికి బలంగా యత్నించాడు. దీంతో ఆమె ధైర్యంగా వారిని ప్రతిఘటిస్తూనే దొంగ దొంగ అంటూ అరవడం మొదలుపెట్టింది. అయినప్పటికీ ఆమెను కిందకు తోసేసి పుస్తెలతాడు లాక్కున్నారు. ఆమె అరుపులు విన్న భర్త ప్రతాప్‌రెడ్డి అక్కడికి వెళ్లగా అతడికి వారికి మధ్య తోపులాట జరిగింది. అక్కడున్న కొంతమంది గ్రామస్తులు అది గమనించి వెంటనే అక్కడి చేరుకొని దొంగలను పట్టుకొని చితకబాదారు. వారి నుంచి పుస్తెలతాడును తీసుకొని.. స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. దొంగలిద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విషయం తెలుసుకున్న ఇబ్రహీంపట్నం ఏసీపీ కేవీపీ రాజు యాచారం పోలీస్ స్టేషన్‌కు చేరుకొని దొంగతనం జరిగిన తీరును బాధిత మహిళను అడిగి తెలుసుకున్నారు. దొంగలకు సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. మొగుళ్లవంపులో పుస్తెలతాడు దొంగతనానాకి పాల్పడిన దొంగలను పాత నేరస్తులుగా పోలీసులు గుర్తించారు. ఇప్పటికే వీరిపై పీటీ కేసులు, బైకు దొంగతనాల కేసులు ఉన్నట్లు గుర్తించారు. దొంగలు ఇప్పటివరకు పాల్పడిన దొంగతనాల గూర్చి పూర్తి వివరాలను ప్రెస్‌మీట్ ద్వారా వెల్లడించనున్నట్లు ఏసీపీ తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

షాబాద్, జూలై 16 : చర్లగూడ గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కంపేట్ ఆంజనేయులు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. షాబాద్ మండలంలోని చర్లగూడ గ్రామంలో గత 15 రోజులుగా మిషన్ భగీరథ తాగునీటి సరఫరా నిలిచిపోయినట్లు తెలిపారు. ఈ విషయమై సంబంధిత అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లినా వారు స్పందించడం లేదని చెప్పారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు.

ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలి

చేవెళ్లటౌన్, జూలై 16 : చేవెళ్లలోని కేజీబీవీ స్కూల్‌లో బోధనేతర పోస్టులకు ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్వేతారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అటెండర్, డే వాచ్‌ఉమెన్ పోస్టులకు 10వ తరగతి అర్హత కలిగి ఉండాలని తెలిపారు. అనుభవమున్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. దరఖాస్తు ఫారంతో పాటు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను జతపరిచి జూలై 20 లోగా పాఠశాల కార్యాలయంలో అందజేయాలని సూచించారు. వీరికి నెలకు రూ.9,750 వేతనం ఇవ్వడం జరుగుతుందని చెప్పారు.

కడ్తాల్ : మండల కేంద్రంలో బుధవారం బీఆర్ఎస్ పార్టీ మండల స్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ మండల నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో మండలంలోని మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చిన్నపిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించాలి

జిల్లాలోని పలు మండలాల్లో 'అమ్మ మాట-అంగన్‌వాడీ బాట' ర్యాలీలు

కడ్తాల్ : అంగన్‌వాడీ కేంద్రంలో చిన్న పిల్లలకు అక్షరాభ్యాసం

కడ్తాల్, జూలై 16 : రెండున్నరేండ్ల చిన్నపిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శబరి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల్లో 'అమ్మ మాట-అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన వీధులగుండా ర్యాలీ నిర్వహించి, ఆయా కేంద్రాల్లో చిన్నారులచే అక్షరాభ్యాసం చేయించారు. రెండున్నరేండ్లు నిండిన చిన్నపిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే చేర్పించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నపిల్లలకు అందించే ఫ్రీ అడ్మిషన్లు, ఫ్రీ స్కూల్ సిలబస్, స్కూల్ కార్యకలాపాలు, పిల్లల కిట్ మెటీరియల్ తదితర అంశాల గురించి తల్లులకు ఆమె వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

బలోపేతం దిశగా..

మొయినాబాద్ : అంగన్‌వాడీలను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అమ్మ మాట-అంగన్‌వాడీ బాట ర్యాలీని మంగళవారం మండల పరిధి బాకారం గ్రామంలో అంగన్‌వాడీ టీచర్ నిర్మల ఆధ్వర్యంలో చిన్నపిల్లలతో కలిసి నిర్వహించారు. తమ పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించాలని.. భవిష్యత్తులో అంగన్‌వాడీ కేంద్రాలు ప్రీ ప్రైమరీ పాఠశాలలుగా మారనున్నాయన్నారు.

అంగన్‌వాడీల సేవలు ఉపయోగించుకోవాలి

చేవెళ్లటౌన్ : ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

మొయినాబాద్ : బాకారం గ్రామంలో చిన్నారులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

చేవెళ్లటౌన్ : అంగన్‌వాడీ సేవలు ప్రతిఒక్కనై ఉపయోగించుకోవాలని సీడీపీవో శోభారాణి తెలిపారు. చేవెళ్లలోని 1, 2 అంగన్‌వాడీ సెంటర్‌లలో ర్యాలీ నిర్వహించి సమావేశం ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీల్లో పిల్లలకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నదన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, టీచర్లు, పిల్లలు, తల్లిదండ్రులు ఉన్నారు.

ముదిరాజ్‌ల సంక్షేమానికి నిధులివ్వాలి

కడ్తాల్, జూలై 16 : ముదిరాజ్ కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి రూ.1000 కోట్ల నిధులను కేటాయించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ముదిరాజ్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కడ్తాల్, తలకొండపల్లి మండలాలకు చెందిన ముదిరాజ్ సంఘం నాయకులు, తెలంగాణ ముదిరాజ్ మహాసభ పిలుపు మేరకు మంగళవారం ఆయా మండల కేంద్రాల్లోని తహసీల్దార్లు ముంతాజ్, రంగారెడ్డిని కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. గ్రామాల్లోని చెరువులు, కుంటలపై ముదిరాజ్‌లకే పూర్తి హక్కులు కల్పిస్తూ చట్టాన్ని రూపొందించాలన్నారు. వెయ్యి కోట్లు నిధులను కేటాయించి, 75 సబ్సిడీతో పథకాలను అమలు చేయాలన్నారు. 50 సంవత్సరాలు నిండిన ముదిరాజ్‌లకు ఆసరా పింఛన్‌ను అందించాలని తెలిపారు. ముదిరాజ్‌లకు వందశాతం ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేయాలని లేకపోతే.. చేపపిల్లలను కొనుగోలు చేసుకునేందుకు సరిపడా నగదును సొసైటీ ఖాతాల్లో జమ చేయాలన్నారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజ్‌లకు ఇస్తామన్న హామీలకు సంబంధించిన అభయహస్తం పోస్టర్లను వారు ఆవిష్కరించారు.

అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలి

ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి

ఆదిబట్ల, జూలై 16 : అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలని ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి మంగల్‌పల్లి పటేల్‌గూడ గ్రామంలో 15వ ఫైనాన్స్ నిధుల నుంచి రూ.50 లక్షల నిధులతో నూతనంగా నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా చేపడుతున్న సీసీ రోడ్డు పనులను పర్యవేక్షించి నాణ్యతతో రోడ్డును ఏర్పాటు చేయాలన్నారు. గ్రామంలో తీవ్ర మంచినీటి సమస్య ఉన్నందున రెండు రోజుల క్రితం గ్రామంలో బోరును ఏర్పాటు చేసి గ్రామంలో మంచి నీటి సమస్యను పరిష్కరించామన్నారు. వాటర్ ట్యాంకు నిర్మాణం పనులు పూర్తికాగానే మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ యాదగిరి, కమిషనర్ బాలకృష్ణ, డీఈ వెంకన్న, ఏఈ వీరాంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.